రేపు ములుగులో 'ప్రజా పాలన ప్రగతి నియోజకవర్గ స్థాయి సభ




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

22వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 125 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 02 మే 2026


# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్



## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా

### ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు

### హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది -2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని **మిగతాది** **2లో...**

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

**న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు**

**ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు**

**ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎంఅంగీకారం**

**జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.
**మిగతాది** **2లో...**




# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

### 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు

### హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

**న్యూఢిల్లీ,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బంధించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, **మిగతాది** **2లో...**

## నారా లోకేష్ పై పవన్ కల్యాణ్ ప్రశంసలు

**పదో తరగతి ఉత్తీర్ణులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్**



**విజయవాడ,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ఏపీలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. **మిగతాది** **2లో...**

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

**నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది**

**దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్**

**డ్రగ్స్ నియంతరణకు మరింత కఠన చర్యలు**

**డిజిపిగా సివి ఆనంద్ ప్రమాణస్వీకారం**

**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ **మిగతాది** **2లో...**



## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

**పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు**




**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు**మిగతాది** **2లో...**

# స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు



### ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్టానికి పూర్వ వైభవం

### విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం

### కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు

**విజయవాడ,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. **మిగతాది** **2లో...**



## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

**ఆగివున్న లారీని వేగంగా ఢీకొన్న కారు**

**ఆరుగురు అక్కడిక్కడే మృతి.**

**.మరొకరి పరిస్థితి విషయం**

**మృతులంతా యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం**

**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. **2లో...**

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



**సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది**

**120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు**

**మరో రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బిఆర్ఎస్ పార్టీదే**

**మేడు ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక **మిగతాది** **2లో...**

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

(మొదటి పేజి తరువాయి)
సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్ధత వల్ల ఎస్ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం



ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

(మొదటి పేజి తరువాయి)
బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు.

1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు.

2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

(మొదటి పేజి తరువాయి)
, ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ -2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ఎ÷-లాన్ -2026ను మంత్రిగారు విడుదల చేశారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ 45 రోజుల్లో రాష్ట్రంలో గ్రామీణ పట్టణప్రాంతాల్లో ఎక్కడకూడా త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా మోటార్లు కాలిపోతే 24 గంటల్లో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని రోజుకు 14 గంటలు ఫిల్లింగ్ చేసి 15వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖలు ముఖ్యంగా పంచాయితీ రాజ్, మున్సిపల్ ,హెల్త్ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణం ఎక్స్‌గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నల్గొండ మంచిర్యాల సూర్యాపేట పెద్దపల్లి జగిత్యాల ఖమ్మం వరంగల్ కరీంనగర్ మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఈ జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ఆడుకుంటూ ప్రమాదాలకు గురౌతున్నారని అందువల్ల ఆయా ప్రాంతాలలో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, పోలీస్ , రెవెన్యూ విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులలో ్ర÷ర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

(మొదటి పేజి తరువాయి)
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

(మొదటి పేజి తరువాయి)
ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

(మొదటి పేజి తరువాయి)
లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

# పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

(మొదటి పేజి తరువాయి)
ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

# నారా లోకేష్ పై పవన్ కల్యాణ్ ప్రశంసలు

(మొదటి పేజి తరువాయి) గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చేపడుతున్న సంస్కరణల వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం సుమారు 4 శాతం మేర మెరుగుపడిందని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ అమలు చేస్తున్న ప్రణాళికలు ప్రశంసనీయమని కొనియాడారు. మెగా పేరెంట్-టీచర్స్ మీట్, పరీక్షలకు ముందు ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళిక వంటి కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని పవన్ పేర్కొన్నారు. గత ఏడాది 72.8 శాతంగా ఉన్న ఉత్తీర్ణత, ఈ ఏడాది 78.39 శాతానికి పెరగడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ విజయం వెనుక అవిశ్రాంతంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు, విద్యాశాఖ అధికారులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# స్కిల్ సెంటర్లుగా లేబర్ అడ్డాలు

(మొదటి పేజి తరువాయి)
పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్-మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు.

# రేపు ములుగులో 'ప్రజా పాలన ప్రగతి నియోజకవర్గ స్థాయి సభ

**ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి సభపాల్గొననున్న ప్రజాప్రతినిధులు, అధికారులుఏర్పాట్లు సమీక్షించిన అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు**




**ములుగు ప్రతినిధి మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం (మే 2న) ఉదయం 10:30 గంటలకు "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" నియోజకవర్గ స్థాయి సభ నిర్వహించను న్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి తెలిపారు. 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావుతో కలిసి ఆయన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతిని సమీక్షించడంతో పాటు ప్రజల నుంచి నేరుగా సూచనలు, అభిప్రాయాలు సేకరించడమే ఈ సభ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతి, వివిధ ప్రభుత్వ శాఖల పథకాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ మార్గాలను అన్వేషించేందుకు ఈ వేదిక ఉపయోగపడు తుందన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అభివృద్ధి ఫలాలు అందరికీ చేరువవుతా యని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టులను హత్య చేసిన వాళ్లను ఎన్కౌంటర్ చేయాలి: పాశం యాదగిరి

- జర్నలిస్ట్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల ఆర్థిక సహాయం ఇవ్వాలి: కె కోటేశ్వరరావు
- జర్నలిస్ట్ హత్యకు నిరసనగా హైదరాబాద్ ఆర్ట్స్ కాలేజీ వద్ద క్యాండిల్ ర్యాలీం
- అవినీతి అక్రమాలను బయట పెడుతున్న జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు, హత్యలు ఇదేనా
- అవినీతి అక్రమాలను ప్రశ్నించేది అడిగేది ఎవరు.? వాస్తవాలు రాయకుంటే అవినీతి అక్రమాలే రాజమేలుతాయి
- జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోయింది, వెంటనే "జర్నలిస్టు ప్రొటెక్షన్ యాక్ట్" తీసుకురావాలి





**హైదరాబాద్ మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాలలో మరోసారి జర్నలిస్టుల భద్రత అంశం వేడెక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి హత్యపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, కె. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసనలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై తమ ఆవేదనను వ్యక్తం చేశారు .సాయంత్రం వేళ ప్రారంభమైన ఈ ర్యాలీ భావోద్వే గభరితంగా సాగింది. చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని, "జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి", "నిజం రాస్తే నరహత్యలా.?" వంటి నినాదాలతో పాల్గొన్నవారు న్యాయం కోరారు. హత్యకు గురైన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ దేశంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం అయిన మీడియాపై దాడులు పెరుగుతున్నాయి. వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులు లక్ష్యంగా మారుతున్నారు. వారికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని మండిపడ్డారు. మరో ముఖ్య అతిథి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ నిజం రాసే వారికి బెదిరింపులు, అక్రమ కేసులు, చివరకు హత్యలు జరుగుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర పరిణామని హెచ్చరించారు. ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు, రాజకీయ నాయకులు మాఫియాలకు అండగా నిలవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆరోపిం చారు. అక్రమాలు, అవినీతి బయటపెట్టే జర్నలిస్టులను కనుమరుగు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని దీనిని సమాజం సహించకూడదని పిలుపునిచ్చారు .ర్యాలీలో పాల్గొన్న పలువురు యువ జర్నలిస్టులు మాట్లాడుతూ తమకు భద్రతపై తీవ్ర ఆందోళన ఉందని వాస్తవాలు రాయలేని పరిస్థితిలు నెలకొన్నాయని తెలిపారు. నిజం రాయాలా.? లేక ప్రాణాలు కాపాడుకోవాలా.? అనే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురా వాలని, దాడులకు పాల్పడిన వారిపై వేగంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో చివరగా మృతి చెందిన జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కి నివాళులు అర్పిస్తూ ముగిసింది. అయినప్పటికీ, జర్నలిస్టుల భద్రతపై ఉన్న అనిశ్చితి మాత్రం ఇంకా తొలగలేదని స్పష్టమైంది. ప్రజాస్వామ్య ంలో జర్నలిస్టులకు స్వేచ్ఛా, రక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనకారులు హెచ్చరించారు.

# ఎరుకలి నాంచారమ్మ జాతరకు ఘన సహకారం... ఎరుకలి కులస్తుల కృతజ్ఞతలు





**ములుగు జిల్లా,మే 01 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామానుజపురం గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఎరుకలి నాంచారమ్మ జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ జాతరకు తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం ఏటూరునాగారం తరఫున పెద్ద ఎత్తున ఎరుకలి కులస్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతరకు వెళ్లే భక్తుల కోసం ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు విశేష సహకారం అందించారు. ఎరుకలి కులస్తుల తరఫున సహాయం కోరగానే "అన్న అంటే నేనున్నా" అంటూ వెంటనే స్పందించిన వారు ప్రయాణ సౌకర్యం కోసం రెండు టాటా మ్యాజిక్ వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సదుపాయాన్ని కూడా కల్పించారు. వారి సహకారంతో జాతరకు వెళ్లిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమంలో పాల్గొనగలిగామని ఎరుకలి సంఘ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఎరుకలి సమాజానికి ఎప్పుడూ అండగా నిలుస్తూ సహాయం అందిస్తున్న నాయకత్వానికి ఏటూరునాగారం ఎరుకలి కులస్తులందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ, ఎరుకలి సమాజ అభ్యున్నతికి రాజకీయ, సామాజిక స్థాయిలో సహకరించే నాయకులను ఎప్పటికీ మర్చిపోమని పేర్కొన్నారు. జాతర సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొని, సంప్రదాయ కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని జాతరను విజయవంతం చేశారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లకొండ ఎల్లా స్వామి, అధ్యక్షులు జగన్నాథం రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథం నాగసాగర్, జగన్నాథం చిన్న రాములు, కేతిరి చిన్న రాములు, కేతిరి తిరుపతి, పులుచేరి రమేష్, రేవెల్లి కిరణ్ కుమార్, మహిళా అధ్యక్షులు శ్రీరాములు సారమ్మ, జిల్లా మహిళా నాయకురాలు సుల్తాన్ లావణ్య, మహిళలు కేతిరి సాం బలక్ష్మి, జగన్నాథం యాకమ్మ తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఎరుకలి సమాజ ఐక్యత, పరస్పర సహకారం, సంప్రదాయాల పట్ల ఉన్న భక్తి స్పష్టంగా కనిపించిందని పాల్గొన్న వారు తెలిపారు.



# 22వ వార్డులో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- కౌన్సిలర్ అల్లే దశరథం, వార్డు అధ్యక్షులు అజయ్ కుమార్ హాజరు



**పరకాల , మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణం 22వ వార్డులో మాల మమత మహేందర్ దంపతులు ఇందిరమ్మ పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహంలో గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అల్లే దశరథం, 22వ వార్డు అధ్యక్షులు కేశబోయిన అజయ్ కుమార్ పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి, నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ములుగులో ఘనంగా మే డే వేడుకలు

- కార్మికులతో కలిసి పాల్గొన్న మంత్రి సీతక్క




**ములుగు ప్రతినిధి మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం మే డే వేడుకలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) గారు ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా హమాలీ కూలీల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ములుగు ఏరియా ఆసుపత్రి కార్మికులు మరియు మున్సిపాలిటీ కార్మికులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని, దేశ ప్రగతికి వారి చెమట చుక్కలే ఇంధనమని కొనియాడారు. కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా స్థాయి నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు

# ఎస్ఎస్‌సీ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య బర్కత్‌పుర క్యాంపస్ విద్యార్థుల ఘన విజయం







**హైదరాబాద్, మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్) :**బర్కత్‌పుర క్యాంపస్ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ఎస్-ఎస్ సీ 2025 -26 పరీక్షలలో అద్భుతమైన ఫలితాలు సాధించి, నారాయణగూడ జోన్‌కు గొప్ప గర్వకారణంగా నిలిచారు. ఫుర్కాన్ ఉల్లా ఖాన్ 584 మార్కులతో మొదటి స్థానం సాధించగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆర్. వంశీ తేజ రావు 575 మార్కులతో, అద్వైత్ సులఖే 574 మార్కులతో నిలిచారు. పలువురు ఇతర విద్యార్థులు కూడా రాణించారు. 25 మంది విద్యార్థులు 560 నుంచి 530 మధ్య మార్కులు సాధించి, వారి నిలకడైన విద్యా ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల అంకితభావం, క్రమశిక్షణ, అవిశ్రాంత కృషిని యాజమాన్యం ఎంతగానో ప్రశంసించింది. వారి అద్భుతమైన విజయాలు వారి నిబద్ధతకు, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విద్యార్థులు ఇతరులకు స్ఫూర్తి అని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యాజమాన్యం వారిని ప్రోత్సహించింది. ఈ సందర్భంగా ఏజీఎం మహమ్మద్ నూర్ అలీ, జోనల్ కో ఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆకుల మాధవి దేవి, డీన్ గాయత్రి, ప్రైమరీ ఇన్‌చార్జ్ సబిత, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ మాలతి కార్యక్రమానికి హాజరై, విద్యార్థులు సాధించిన గొప్ప విజయానికి వారిని అభినందించారు. ఈ విజయం ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన కృషికి, తల్లిదండ్రుల బలమైన మద్దతుకు కూడా దక్కుతుంది.

# అక్షర హై స్కూల్ SSC ఫలితాలు: విద్యార్థులను అభినందించిన చొప్పదండి ఎమ్మెల్యే




**రామడుగు మే 01 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఇటీవల విడుదలైన SSC2026 ఫలితాలలో గుండిగోపాలరావుపేటలోని అక్షర హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం పాఠశాలను సందర్శించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పూలగుచ్ఛాలతో అభినందించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు: కొలిపాక మధుమిత (589), ఎగుర్ల హర్షిని (586), శ్రీరామోజు శ్రీజ (581), మ్యాడరపు నీతువచన్ (574), 589 మార్కులు సాధించిన కొలిపాక మధుమితకు పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్ ప్రకటించిన రూ.10,000 నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థుల కృషిని, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## వాసవి క్లబ్ కాపుల్స్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ అధ్వర్యములో కొండగట్టు గిరిప్రదక్షిణ





**గంగాధర మే 1(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో పౌర్ణమి సందర్భముగా గిరి ప్రదీక్షణ సురేశ్ ఆత్మారాం రామ్ గురువు అధ్వర్యములో శ్రీనివాసుల సేవాసమస్త సభ్యుల సహకారముత్ప 3000 మంది భక్తులకూ మజ్జి గా అరటిపండ్లు పంపిని చేయద్దం జరిగింది శ్రీరామ జయరామ్ నామలతో కొండగట్టు పరిసర ప్రాంతాలు మారు మ్రోగినవి సుమన్ టివి వారు ప్రత్యక్ష ప్రచారం చేసారు వాసవి క్లబ్ కాపుల్స్ ప్రెసిడెంట్ జిల్లా జగదీష్, గంప శ్రీనివాస్, తొడుపునూరి తిరుపతి R S s S సభ్యులు తిరుపతి శ్రీనివాసరావు, నార్ల శ్రీనివాస్, పైడ శ్రీని వాస్,కొండ ప్రభాకర్,సతీష, చింత కింద ప్రవీణ్ పాలుగొన్నారు.

## గంగాధర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో....




**గంగాధర మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గౌడ గంగాధర మండలంలో గంగాధర క్రికెట్ అసోసియేషన్ మరియు సుఫా క్రికెట్ అకాడమీ మధ్య వన్ డే లీగ్ మ్యాచ్ గంగాధర జట్టు విజయం.గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ లో సుఫా మొదట బ్యాటింగ్ చేసి 33.3 ఓవర్లు లో 182 పరుగులకు ఆల్ అవుట్ కాగా రెండోవ బ్యాటింగ్ చేసిన గంగాధర జట్టు 22 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 183 పరుగులతో విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో షానగర్ పంచాయత్ సెక్రటరీ పొన్నం మధు (వ× ఆర్మీ) ,గంగాధర కోచ్ విజయ్ , ఠాగూర్ ,కట్ల శ్రీనివాస్ ,ఉపేందర్,వివేక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వి. హనుమంతరావుకు శుభాకాంక్షలు తెలిపిన రోహిన్ రెడ్డి



**అంబర్ పేట మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అంబర్ పేట ఇంచార్జ్ డాక్టర్ రోహిన్ రెడ్డి బాగ్ అంబర్ పేట్ వీహెచ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వి . హనుమంత రావుకు ప్రభుత్వ సలహాదారు పదవితో పాటు 'క్యాబినెట్ హోదా'ను ప్రభుత్వం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న హనుమంతరావు సేవలను ప్రభుత్వ పాలనలో వినియోగిం చుకోవడం శుభ పరిణామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఫిషర్ డిపార్ట్మెంట్ చైర్మన్ మెట్టు సాయి, నాయకులు ఆర్. లక్ష్మణ్ యాదవ్, అఫ్సర్ యూసుఫ్ జాహి , మాజీ కార్పొరేటర్ పుల్ల నారాయణస్వామి, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, గడ్డం శ్రీధర్, దిలీప్ కుమార్ నేత, ఫరీద్, లక్ష్మణ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



## నవాబ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వారి SSCలో 100% ఫలితాలు...




**కరీంనగర్,మే01(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని నవాబ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 20252026 విద్యా సంవత్సరానికి సంబంధించిన SSC పరీక్షల్లో శాతం వంద ఫలితాన్ని నమోదు చేసి విశేష ప్రతిభ చాటుకుంది. పరీక్షలకు హాజరైన మొత్తం 61 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు.ఈ ఫలితాల్లో భాగంగా 23 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం. పాఠశాలలో అత్యధికంగా 570 మార్కులు నమోదు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశవ్యాప్తంగా కూడా పలు పాఠశాలలు 100% ఫలితాలను నమోదు చేస్తుండగా, ఈ పాఠశాల విజయం అదే సరసన నిలిచింది.టాపర్‌ల వివరాలు ఇలా ఉన్నాయి:మరిషా మబ్రూక్ 570 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, సయ్యదా అలీనా ఇరామ్ 563 మార్కులతో రెండో స్థానం, అస్నా షహ్రీన్ 556 మార్కులతో మూడో స్థానం సాధించారు.ఈ విజయానికి పాఠశాల ఛైర్మన్ ప్రోత్సాహం, ప్రిన్సిపాల్ సమర్థ మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల కృషి ప్రధాన కారణమని యాజమాన్యం తెలిపింది.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించింది.

# భద్రతే ప్రాణ రక్షణ

- కల్లూరులో విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రారంభం
- విద్యుత్ ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన
- గోడ ప్రతుల పోస్టర్ ఆవిష్కరణ



**కల్లూరు, మే 1(పిసిడబ్ల్యూ న్యూస్) :**విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా కల్లూరు విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో మే 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలలో భాగంగా గోడ ప్రతుల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.పెనుబల్లి విద్యుత్ సబ్ డివిజన్ సహాయ డివిజన్ ఇంజనీర్ సగ్గుర్తి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో విద్యుత్ సిబ్బందికి ఉపకేంద్రాలలో మరియు ఫీల్డ్‌లో పనిచేసేటప్పుడు తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై వివరించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై కూడా అవగాహన కల్పించారు. అదే విధంగా విద్యుత్ వినియోగంలో వినియోగదారులకు భద్రతా సూచనలు ఎలా చేరవేయాలనే అంశంపై సిబ్బందికి మార్గదర్శకాలు అందించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ కె. మహేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- 17వ డివిజన్ కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి...



**కరీంనగర్,మే01(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ కార్పోరేషన్ కొత్తపల్లి 17 వ డివిజన్ లో పూర్తయిన మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు లబ్ధి దారులు పెంటి శ్రీలత శ్రీకాంత్ గార్ల ఇందిరమ్మ ఇల్లును సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.మొదటి విడతలో మంజూరైన లబ్దిదారులు పోను ఇంకా మిగిలిపోయిన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,గడ్డం శ్రీనివాస్,చిలుక హన్మంత రెడ్డి,గున్నాల రమేష్,చింతల శ్రీనివాస్ రెడ్డి,జేరిపోతుల వాసు,యాస్వాడ రాజకుమార్, కొండం శ్రీనివాస్,సంగం మునిందర్,రాపర్తి రాజు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భోగ రాజేశంను పరామర్శించిన సుడా చైర్మన్



**కొత్తపల్లి మే 01(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై చికిత్స పొందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భోగ రాజేశం ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వైద్యుడు డా. అంజన్ కుమార్ కూడా అక్కడే ఉండి రాజేశం ఆరోగ్య స్థితిగతులను వివరించారు. రాజేశం కోలుకుంటున్నారని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హనుమాన్ హిందూ సమ్మేళన సమితి( ఆదర్శ్ నగర్ బస్తి) ఆద్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం




**కరీంనగర్,మే01(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణం (ఆదర్శ్ నగర్ బస్తి)హనుమాన్ హిందూ సమ్మేళన సమితి ఆద్వర్యంలో నిర్వహించినహిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. హిందూ సమ్మేళనం కార్య నిర్వహణ సమితి అధ్యక్షులు మెతుకు కనుకయ్య ప్రధాన కార్యదర్శి కస్తూరి సుధాకర్ ,మహిళవక్త భోయిని జయప్రద మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి హిందువులంతా కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగాలన్నారు. భారతీయ సంస్కృతి లో మహిళ శక్తి కి ఎంతో ప్రాధాన్యత ఉందని, మహిళ గొప్పతనం గురించి మాటల్లో వర్ణించలేమన్నారు. ప్రధాన వక్త ఆదరణీయ కొంపల రాజన్న హిందూ సమాజంపై జరుగుతున్న దాడిని, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై , హిందూ ఐక్యత గురించి వివరించారు. ప్రధాన అర్చకులు విశ్వపతి శర్మ దేవాలయం గొప్పతనం గురించి హిందూ సంస్కృతి గురించి వివరించారు,అధ్యక్షుడు మెతుకు కనుకయ్య మాట్లాడుతూ హిందూ సమాజ సంఘటిత శక్తి కోసమే మనం హిందూ సమ్మేళనాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. హిందువులు గుడికి వెళ్ళే ఆవశ్యకత ను తెలియజేస్తూ మాట్లాడారు. కార్యక్రమ అనంతరం మహిళలకు గాజులు, పసుపు కుంకుమ ను ఈ సందర్భంగా సమితి అందజేసింది.

## కరీంనగర్‌లో జమీయత్ అల్ హుఫ్ఫాజ్ ఆద్వర్యంలో చలివేంద్రం ప్రారంభం...







**కరీంనగర్,మే01(పీసీడబ్ల్యూ న్యూస్):** వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జమీయత్ అల్ హుఫ్ఫాజ్ కరీంనగర్ ఆధ్వర్యంలో కశ్మీర్ గడ్డ, రైతు బజార్ వద్ద ఆబ్దార్ ఖానా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని హాఫిజ్ మహమ్మద్ ముఅజ్జమ్ హుస్సేన్ ఫైజీ (జమీయత్ అల్ హుఫ్ఫాజ్ ఖజాంచీ, మదర్సా ఇస్లామియా అఫ్జల్ ఉల్ ఉలూమ్ నాజిమ్) ప్రార్థనలతో ప్రారంభించారు.ఈ సందర్భంగా జమీయత్ అల్ హుఫ్ఫాజ్ అధ్యక్షుడు, ఖాజీ హాఫిజ్ అహ్మద్ మన్కబత్ షా ఖాన్ మాట్లాడుతూ, సంస్థ ఎప్పటికప్పుడు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సహాయం అందిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.61వ డివిజన్ కార్పొరేటర్ అతిఫ్ అత్నా మాట్లాడుతూ, జమీయత్ అల్ హుఫ్ఫాజ్ సంస్థ ఎన్నో సంవత్సరాలుగా ప్రజాసేవలో ముందంజలో ఉందని కొనియాడారు. రైతు బజార్ ప్రాంతంలో రైతులు, ప్రయాణికులకు చల్లని నీటి సౌకర్యం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు హాఫిజ్ మహమ్మద్ జియా ఉల్లా ఖాన్, ఖజాంచీ హాఫిజ్ సయ్యద్ ఫరీదుద్దీన్ అంజద్, కార్యదర్శి హాఫిజ్ మహమ్మద్ వసీం ఉద్దీన్, జహీర్ అహ్మద్, కార్పొరేటర్ మొహ్సిన్ మొహియుద్దీన్, యునైటెడ్ స్కూల్ కశ్మీర్ గడ్డ కరస్పాండెంట్ నయీమ్, గులామ్ హక్కానీ, ఖాలిద్, బాబా భాయ్, సలీం, సీనియర్ నాయకుడు నసీం ఖాన్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

# రంగం బంజరలో ఘనంగా మే డే వేడుకలు

- కార్మికుల హక్కులపై అవగాహన



**తల్లాడ, మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో రంగం బంజర గ్రామంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు కార్మిక సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ వైరా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పగడాల లచ్చిరెడ్డి, ఎస్టీ సెల్ తల్లాడ మండల అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా జెండా ఆవిష్కరణ చేసి స్వీట్లు పంచారు. అనంతరం దశరథ్ నాయక్, లచ్చిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల శ్రమకు గౌరవం ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. పారిశ్రామిక విప్లవం తర్వాత కార్మికులు ఎదుర్కొన్న కష్టాలు, తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు వంటి సమస్యలను వివరించారు. 1886 మే 1న కార్మికులు చేపట్టిన ఉద్యమం ప్రపంచ కార్మిక చరిత్రలో కీలక మలుపు అయ్యిందని తెలిపారు.రోజుకు 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల వ్యక్తిగత జీవితం అనే నినాదంతో కార్మికులు సాధించిన హక్కులు ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల ఐక్యతే విజయానికి మార్గమని, శ్రమే దేశ సంపద అని వారు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో తాటి అప్పారావు, భాస్కరరావు, జానకి రాములు, పిచ్చయ్య వెంకటకృష్ణ, సుబ్బయ్య, లక్ష్మయ్య, విజయ్ బాబు, రాములు, నరసింహారావు, నాగేశ్వరరావు, బసవయ్య, శీను, వీరయ్య, కృష్ణయ్య, నాని, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చికాగో కార్మిక అమరుల స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

చికాగో అమరవీరులకు ఘన నివాళులు

ఎర్రజెండా ఎగురవేతతో మేడే వేడుకలు.

కార్మిక చట్టాల రద్దుపై ఆగ్రహం..

కేంద్ర విధానాలపై తీవ్ర విమర్శలు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి

పిలుపు... కార్మికరైతు ఐక్యత అవసరం

సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పిలుపు




**మహబూబాబాద్, మే 1: (పిసిడబ్ల్యూ న్యూస్):** చికాగో కార్మిక అమరవీరుల స్ఫూర్తితో దేశంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు, కార్మికులు, రైతు కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పిలుపునిచ్చారు. 140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో అరుణపతాకాన్ని ఎగురవేసి చికాగో కార్మిక అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమానికి పి.ఓ.డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత అధ్యక్షత వహించగా, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సనప పోమ్మయ్య ఐఎఫ్‌టియు జెండాను ఎగరవేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం చికాగోలో జరిగిన పోరాటం ప్రపంచ కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకమైందని తెలిపారు. పని గంటల తగ్గింపు, శ్రమకు తగిన వేతనం కోసం పోరాడిన కార్మికుల త్యాగాలతోనే ఎర్రజెండా ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక, రైతు కూలీ ఉద్యమాలకు ఎర్రజెండా దిక్సూచి అయిందని, నిరుపేదలకు బాసటగా నిలిచిందని చెప్పారు. మేడే అంటే కార్మికుల ఐక్యత, పోరాట సంకల్పానికి ప్రతీక అని అన్నారు. ప్రస్తుతం దేశంలో అమలవుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, కేంద్ర ప్రభుత్వం పూర్వం అమలులో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మిక హక్కులు తీవ్రంగా దెబ్బతిన్నాయని విమర్శించారు. ఈ మార్పులతో అనేక కంపెనీల్లో కార్మికులు రక్షణ కోల్పోతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి, ఆర్టీసీ, రైల్వే, విద్యుత్, బ్యాంకింగ్, ఎల్‌ఐసీ వంటి రంగాలను బలహీనపరచే చర్యలను ఖండించారు.

రైతాంగానికి సరైన మద్దతు ధరలు కల్పించకపోవడం, విదేశీ వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడే స్ఫూర్తితో పాలక వర్గాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పీడీఎస్యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, సట్ల యాకన్న, బిక్షపతి, నర్సిరెడ్డి, భాగ్యలక్ష్మి, అనురాధ, స్వరూప, ఇరుగు నాగన్న, వీరన్న, హనుమ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య కాలనీలో కూడా పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# నిరుపేదల సొంతింటి కలలను నిజం చేస్తాం

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ

ఇల్లు మంజూరు చేస్తాం

చొప్పదండి నియోజకవర్గం లో 3500

ఇండ్లను మంజూరు చేసాం

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో రానున్న రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడానికి కృషి చేస్తున్నాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర మండలంకురిక్యాలలో ఇందిరమ్మ లబ్ధిదారురాలు సముద్రాల కవిత-కిషన్ గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే





**గంగాధర మే 1(పిసిడబ్ల్యు న్యూస్):** చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు సముద్రాల కవిత–కిషన్ గృహప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరైనారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే సత్యం కు సముద్రాల కవిత–కిషన్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గం లో రెండేళ్లలోనే అర్హులైన లబ్ధిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. కురిక్యాల గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని 208 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 95 మంది లబ్ధిదారులు సొంత ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశం చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లో నిరుపేదల సొంటింటి కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో నిరుపేదల కోసం ఒక్కటంటే ఒక్కటి కూడా కట్టించలేదని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో నాటి కెసిఆర్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇండ్లు రాని నిరుపేదలు ఆందోళన చెందవద్దని, రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కడారి రేణుక కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మేర్జ కొండయ్య, దోర్నాల అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కలం కార్మికులే సమాజానికి దిక్సూచి

పనిగంటలకు అతీతంగా

ప్రజాసేవలో జర్నలిస్టులు

'మే' డే సందర్భంగా (కలం కార్మికులు)

జర్నలిస్టులకు శుభాకాంక్షలు

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్







**ఖమ్మం ప్రతినిధి, మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజానికి కళ్లూ చెవుల్లా నిలిచే జర్నలిస్టులు పనిగంటలకతీతంగా ప్రజాహితానికి అంకితమై సేవలందిస్తున్నారని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – బీ – 2843) రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ పేర్కొన్నారు. 'మే' డే దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకలు గౌరవప్రదంగా, ఉత్సాహభరితంగా సాగాయి. ముందుగా జర్నలిస్టు అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ.. జర్నలిజం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు, అది ఒక బాధ్యత, ఒక త్యాగం, ఒక నిరంతర యజ్ఞమని పేర్కొన్నారు. సాధారణ కార్మికులకు ఎనిమిది గంటల పని పరిమితి ఉన్నప్పటికీ, జర్నలిస్టులకు మాత్రం సమయం అనే పరిమితి ఉండదన్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా, ఆసుపత్రిలో బాధిత కుటుంబంతో ఉన్నా, సంఘటన స్థలంలో ఉన్నా.. ప్రజల కోసం ఎప్పుడైనా సిద్ధంగా ఉండాల్సిన వృత్తి జర్నలిజమని స్పష్టం చేశారు. కలం కార్మికులు సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తారని, వారి కృషి లేకపోతే ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుకోవడంలో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. నిజాలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్ర అపారమని, వారి అంకితభావం సమాజ అభివృద్ధికి పునాది అని కొనియాడారు. అయితే, ఇంతటి సేవలందిస్తున్న జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తగిన జీతాలు లేకపోవడం, అక్రిడిటేషన్ కార్డుల ఆలస్యం, ఇండ్ల స్థలాల లేమి, హెల్త్ కార్డుల అవసరం, పిల్లలకు ఉచిత విద్య, వృద్ధాప్యంలో భద్రత కోసం పెన్షన్లు ఇలాంటి కీలక అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 'మే' డే సందర్భంగా జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగితేనే తమ హక్కులను సాధించగలరని, ఐక్యతే వారి అసలైన బలం అని పిలుపునిచ్చారు. కలం శక్తి ఒకటైతే సమాజాన్ని మారుస్తుందనే విశ్వాసంతో అందరూ ఒకే వేదికపై నిలబడాలని సూచించారు. కలం కార్మికుల ఐక్యతే వారి బలం, వారి సేవే సమాజానికి వెలుగని అన్నారు. **మధుసూధన్ కు టీడబ్ల్యూజేఎఫ్ నివాళి :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సీపీఆర్ఓ మధుసూదన్ ... జర్నలిస్టుగా ఖమ్మం జిల్లాలో అనేక సేవలందించారని, వారి అకాల మరణం జర్నలిస్టు లోకాన్ని కలచివేచిందని అన్నారు. మధుసూదన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మధుసూదన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుపాటి మాధవరావు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మధుశ్రీ, అర్షద్, జిల్లా నాయకులు షేక్ జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, టిబివిజిపి అధ్యక్షులు ఫయాజ్, సెక్రటరీ గణేష్, కొమిరె నాగేశ్వరరావు, కె. కిరణ్, గోపీ, కొరకొప్పుల రాంబాబు, షకీల్, గోపాలకృష్ణ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.




## గో సంతతిని కాపాడుకుందాం: ఎమ్మెల్సీ కోదండరామ్




**హైదరాబాద్, మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశవ్యాప్తంగా గోవులతో పాటు వ్యవసాయ రంగాన్ని పరి రక్షించుకుందామని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఆయన ఎన్నికైన నేపథ్యంలో కాచిగూడకు చెందిన తెలంగాణ లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ప్రాణిమిత్ర రమేశ్ జాగిర్దార్ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి రితీష్ జాగిర్దార్, తరుణ్ మేహతా, శ్రీకాంత్ తదితరులు సన్మానించి గోసంరక్షణ ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. పశు సంపద, వ్యవసాయ రంగానికి అవినాభావ సంబంధం ఉందని తెలిపారు.

## గోపాల్ రావు పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో కార్మికుల దినోత్సవం ఘనంగా






**రామడుగు మే 01(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని గోపాల్రావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మే 1 వ తేదిన కార్మికుల దినోత్సవం పుకస్కరించుకోని గోపాల్రావుపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి ఆద్వర్యంలో కార్మికుల శ్రమను గౌరవిస్తూ శాలువతో సత్కరించి స్వీట్లు పంపిణీ చేయటం జరిగింది. అనంతరం వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తూ కార్మికుల సమస్యలను అడిగి తేలుసుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో గోపాల్రావుపేట సర్పంచ్ ఎడవెల్లి వనజ నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పిండి సత్యం రెడ్డి మార్కెట్ కమిటీ డైరక్టర్లు ఆధికారులు, సిబ్బంది, కార్మికులు, రైతులు తదితరులు పాల్గోన్నారు.

## ఈనాడు రిపోర్టర్ బొజ్జ రాజ్ కుమార్ అకాల మరణం పట్ల సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సంతాపం



**కరీంనగర్ జిల్లా మే 01(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలానికి చెందిన ఈనాడు రిపోర్టర్ బొజ్జ రాజ్ కుమార్ (35) అకాల మరణం పట్ల ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ వయస్సులోనే రాజ్ కుమార్ మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానన్నారు.

# సేవలతో మెప్పించిన రాజిరెడ్డి... డీఎస్పీగా పదోన్నతి

**● అభినందించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ● ప్రజాభిమానాన్ని సంపాదించిన పోలీస్ అధికారి విజయయాత్రకు మరొక మైలురాయి**



**ఖమ్మం ప్రతినిధి, మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజలతో మమేకమై సేవలు అందిస్తూ మంచి పోలీస్ అధికారిగా గుర్తింపు పొందిన సిహెచ్. రాజిరెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొందడం ఆనందదాయక పరిణామంగా మారింది. ఖమ్మం జిల్లాలో ఎస్సై, సిఐగా వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఆయన, తన కర్తవ్యనిష్ఠతో పాటు మానవీయ విలువలను కాపాడుతూ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. ఖమ్మం సిటీ స్పెషల్ బ్రాంచ్ విభాగంలో ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఆయనకు వచ్చిన ఈ పదోన్నతి, ఆయన కృషికి నిదర్శనంగా నిలిచింది. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్వయంగా పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి రాజిరెడ్డిని అభినందించారు. సేవలో క్రమశిక్షణ, సహచరులతో సమన్వయం, ప్రజలతో సాన్నిహిత్యం ఈ మూడు లక్షణాలు రాజిరెడ్డి వ్యక్తిత్వానికి ప్రత్యేక గుర్తింపు నిచ్చాయి. పరిచయం అయిన వ్యక్తులను సంవత్సరాల తర్వాత కూడా పేరుపేరునా గుర్తుంచుకుని పలకరించడం ఆయన మనసు విశాలతను తెలియజేస్తుంది. ఇలాంటి మానవీయ దృక్పథం కలిగిన అధికారులు పోలీసు వ్యవస్థలో ఉండడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని సహచరులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సేవను ధ్యేయంగా పెట్టుకుని ముందుకు సాగుతున్న ఆయన ప్రయాణం మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# మీడియా అక్రెడిటేషన్ కమిటీలో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం పట్ల హైకోర్టు ఆగ్రహం

**● కోర్టు దిక్కారణగా పరిగణించాల్సివస్తుందని వ్యాఖ్య**

**హైదరాబాద్ మే 01(పిసిడబ్ల్యూ న్యూస్):** మీడియా అక్రెడిటేషన్ కమిటీ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ కు ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై ఆ సంఘం వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్యహైకోర్టు లో దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం సింగిల్ బెంచి విచారణ జరిపింది. ఈ విచారణ సందర్బంగా ప్రభుత్వ న్యాయవాదుల వాదనలు, పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న తర్వాత సింగిల్ బెంచి న్యాయమూర్తి జస్టిస్‌రేణుక యార తీవ్రంగా స్పందించి



ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో పిటిషనర్ మామిడి సోమయ్య ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ కు దాఖలు చేసుకున్న దరఖాస్తును అమలు చేయకపోడం, ప్రభుత్వ న్యాయవాదులు కౌంటర్ ఫైల్ చేయకపోడం పట్ల న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 20న పిటిషనర్ సమర్పించిన రిప్రజెంటేషన్ పై ఎటువంటి చర్యలు తీసుకున్నారో, తీసుకున్న చర్యల పై ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ఎటువంటి నివేదిక సమర్పించారో తెలియజేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ వ్యాజ్యన్ని తదుపరి విచారణకు వాయిదా వేశారు. అదేవిధంగా మార్చి 26న కోర్టుజారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేసి నివేదికను కోర్టుకు సమర్పించాలని జస్టీస్ రేణుక యారా ప్రతివాదులను ఆదేశించారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయకపోతే కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని ప్రభుత్వ న్యాయవాదులను వ్యాఖ్యానిస్తూ ఆదేశాలు జారీ చేశారు .

# మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకుందాం

**● లేబర్ కోడ్‌ల రద్దుకై కార్మిక ఐక్య ఉద్యమాలు కొనసాగిద్దాం ● నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**

**కురవి,మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దశాబ్దాల కార్మిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న అనేక రకాల హక్కులు నేడు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకై పోరాడుదాం అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు కొరవి మండల కేంద్రంలో సిపిఐ ఏఐటియుసి ల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు గ్రామపంచాయతీ కార్యాలయం నుండి సకీత వరకు ఎర్రజెండాలు చేబూని మేడే వర్ధిల్లాలని, కార్మిక ఐక్యత సాగాలనే నినాదాలతో ప్రదర్శన చేశారు గుడిసెంటర్



లో కార్మిక విగ్రహాల దగ్గర సుధాకర్ రెడ్డి అరుణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడుతూ వందేళ్లుగా మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం సాధించుకున్న 8 గంటల పని దినం, సమ్మె హక్కు, ధర్నా ,ఉద్యోగ భద్రత, ప్రశ్నించే హక్కులు కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో హరించివేస్తూ, లక్షలాది ఐటీ ఉద్యోగులను ఏలాంటి కారణము లేకుండా బజారున పడవేస్తున్నారని, కార్పొరేట్ శక్తులకు లాభాలను దోచిపెట్టి కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసే ఫాసిస్ట్ విధానాలను కార్మిక వర్గం సంఘటిత ఉద్యమాలతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు బుడమ వెంకన్న, అమరవీరుల స్తూపం వద్ద సిపిఐ జెండాలు బుర్ర సమ్మయ్య, హమాలి వర్కర్స్ యూనియన్ బొల్లం ఉప్పలయ్య పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కలగుర నాగరాజు పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జెండాలు దడిగెల నరసయ్య ఎగరవేశారు. నాయకులు దూదికట్ల సారయ్య, కన్నె వెంకన్న, పోలేపాక వెంకన్న, గురువయ్య, కాట్యాల కృష్ణ, బొల్లం విజయ్, దైద వీరన్న పాల్గొన్నారు.

# చిలుకోయాలపాడులో ఘనంగా మే డే వేడుకలు

**● జెండా ఆవిష్కరణ చేసిన తాపీల మేస్త్రి సంఘం అధ్యక్షుడు పొన్నం వీరన్న**

**● ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న**



**సిరోల్, మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** సిరోల్ మండలం చిలుకోయాలపాడు గ్రామంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా తాపీల మేస్త్రి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పొన్నం వీరన్న జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమని కొనియాడారు. కష్టానికి ప్రతీకలైన శ్రామికుల కృషి వల్లనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొన్నం వీరన్న మాట్లాడుతూ, కార్మికుల హక్కుల సాధన కోసం మే డేకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులను సాధించగలరని అన్నారు. ఈ వేడుకల్లో సిరోల్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామంలోని కార్మికులు, యువకులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల పరిస్థితి ఇలా... ప్రయాణికులు పోయేది ఎలా...?

**- పేరు గొప్ప. ఊరు దిబ్బ అనే పరిస్థితికి నెలకొన్నది.**

**- బస్టాండ్‌లో తాగునీరు లేక అల్లాడుతున్న ప్రయాణికులు?.**

**- ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పేరు కోసమేనా?.**







**తొర్రూరు ప్రతినిధి,మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వరంగల్ రీజనల్ లో తొర్రూరు టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ కుఎంతో పేరుగాంచినది. ప్రస్తుత పరిస్థితులు మాత్రం పచ్చని చెట్టుకి చెదలు పట్టినట్లుగా మారిందని బస్టాండ్ ప్రాంగణాన్ని చూసిన ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు?. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు మరుగుదొడ్లలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులకు ఏమి పట్టింపు లేదని ఎవరికి వారే ఇష్టం వచ్చినట్లుగా పరిస్థితులను చూసి మాట్లాడుతున్నారు ప్రయాణికులు?. తొర్రూరు పట్టణంలో ఎందరో ప్రజా ప్రతినిధులు ఉన్న పేరుకు మాత్రమే గొప్పలు చెప్పుకుంటున్నారని ఎంతోమంది స్వచ్ఛంద సంస్థలు ఉన్నప్పటికీ కూడా కనీసం ప్రయాణికుల దాహార్తిని తీర్చాలని ఆలోచన ఎవరికి రాలేదా చిన్నపిల్లలతో వృద్ధులు, ప్రయాణికులు మంచినీరు దొరకక అల్లాడుచున్నారని ఇదేమి బస్టాండ్ అంటూ మండిపడుతున్నారు?. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గాని స్వచ్ఛంద సంస్థలు గాని ముందుకు వచ్చి ప్రయాణికుల దాహార్తిని తీర్చే విధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పోతున్నామని ఇతర జిల్లాల నుండి వచ్చే ప్రయాణికులు దాహార్తిని తీర్చుకునేందుకు బస్సు నుండి దిగిన ఎక్కడా తాగునీరు కానరావడం లేదని కనీస సౌకర్యాలు కూడా బస్టాండ్లో కరువవుతున్నాయని అంటున్నారు. ఒక స్వచ్ఛంద సంస్థ ద్వారా మజ్జిగ పంపిణీ చేస్తే సరిపోదాని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికుల దాహార్తిని తీర్చాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు. మరుగుదొడ్లలో మామూలు డోర్లకు బదులు ఇనుప డోర్లనుబిగిస్తే బాగుంటుంది అని ఒక ప్రయాణికుడు ఆయన సలహా తెలిపారు. బస్టాండ్ లోని పరిస్థితులను గమనించిన పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ ఒక అధికారి నీ వివరణ కోరగా బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మరుగుదొడ్లు ప్రయాణికుల వల్ల పూర్తిగా దుర్గంధ భరితంగా చేస్తున్నారు అని అందులోనే మద్యం తాగుతూ సీసాలను పగలగొడుతున్నారని ఇదంతా రాత్రి వేళలో ఇష్టానుసారంగా తలుపులను విరగ కొట్టడం లాంటివి చేస్తున్నారని గతంలో పలుమార్లు రిపేరు చేసినప్పటికీ కూడా ప్రయాణికుల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు వివరణ ఇచ్చారు. త్వరలో మరుగుదొడ్ల తలుపులను ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రయాణికులు కూడా ఇష్టానుసారంగా తలుపులు విరగొట్టడం సరైంది కాదని అధికారులు పేర్కొన్నారు.

# శ్రీనగర్ గ్రామంలో ఘనంగా మేడే వేడుకలు



**మల్లంపల్లి మండల ప్రతినిధి మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీనగర్ గ్రామంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామంలోని కార్మికులు, కూలీలు, వివిధ కార్మిక సంఘాల నాయకులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ఉదయం కార్మిక జెండా ఆవిష్కరణతో ప్రారంభమైంది. అనంతరం కార్మికుల హక్కుల కోసం ప్రాణాలు అర్పించిన మహానుభావులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి, కార్మిక ఐక్యతను ప్రతిబింబించింది. పాల్గొన్నవారు “కార్మికుల ఏకతా జిందాబాద్”, “మా హక్కులు సాధించాలి” వంటి నినాదాలతో ఉత్సాహాన్ని చాటారు. ప్రధాన అతిథులు, స్థానిక నాయకులు మాట్లాడుతూ కార్మికుల శ్రమే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని పేర్కొన్నారు. ప్రతి అభివృద్ధి వెనుక కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని, వారి కష్టాన్ని గౌరవించడం సమాజ బాధ్యత అని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఆరోగ్య భద్రత, పని సమయంలో రక్షణ, సముచిత పనివేళలు వంటి మౌలిక హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడాయి. పాటలు, నృత్యాలు, నాటికలు ద్వారా కార్మికుల జీవితం, వారి సమస్యలు, వారి పోరాటం ప్రతిబింబించబడింది. చిన్నపిల్లలు కూడా పాల్గొని కార్యక్రమానికి మరింత ఆకర్షణను తెచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు తమ సమస్యలను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా ఉపాధి భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లేకపోవడం వంటి అంశాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. చివరగా కార్మికుల ఐక్యత, సంకల్పబలం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ఈ వేడుకలు గ్రామంలో కార్మికుల గౌరవాన్ని మరింత పెంచుతూ, వారి హక్కులపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాయి.

# మే డే సందర్భంగా కార్మిక లోకానికి ఆకుల గాంధీ శుభాకాంక్షలు



**ఖమ్మం, ప్రతినిధి మే 1 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం “మే డే” సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ కార్మిక, శ్రామిక లోకానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమని, వారి కృషి వల్లే దేశ అభివృద్ధి సాధ్యమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి చెమట చుక్కకు అపారమైన విలువ ఉందని, కార్మికుల శ్రమకు తగిన గౌరవం, గుర్తింపు లభించాలన్నారు. తమ కృషితో మరిన్ని విజయాలు సాధించి, సమాజంలో ఉన్నత స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. సమాజాన్ని ముందుకు నడిపించే ప్రతి కార్మికుడికి ఆనందం, ఆరోగ్యం కలగాలని కోరుకున్నారు. “శ్రమే విజయానికి మార్గం” అని పేర్కొన్న ఆకుల గాంధీ, కార్మికుల జీవితాల్లో ఎల్లప్పుడూ వెలుగులు నిండాలని, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పని చేసే ప్రతి మనిషి నిజమైన హీరో అని, వారి కృషి ఎప్పటికీ చిరస్మరణీయమవుతుందని అన్నారు. కార్మికుల కష్టానికి తగిన ఫలితం దక్కాలని, వారి జీవితాల్లో కొత్త ఆశలు, అవకాశాలు వెలిసేలా మే డే ప్రేరణ కలిగించాలని ఆకుల గాంధీ అభిలషించారు.

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా

● జిల్లాలో మే మాసంలో 2,35,260 మందికి రూ.103.90 కోట్ల రూపాయల పెన్షన్లు పంపిణీ: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):-** లబ్దిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందచేస్తూ, మే మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 35 వేల 260 మంది లబ్దిదారులకు రూ.103.90 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా స్థానిక లేబర్ కాలనీ లో ఎద్దుల లక్ష్మమ్మ, సిరివెళ్ల సుబ్బమ్మ, అయ్య పోగు మాదన్న లకు వృద్ధాప్య పెన్షన్, కృష్ణ కు వైకల్య పెన్షన్, చింతలపల్లి పరమేశ్వరి, గొల్ల లక్ష్మి లకు వితంతువు పెన్షన్ లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్దిదారులకు పెన్షన్ లను పంపిణీ చేస్తూ వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో, వికలాంగులతో కలెక్టర్ ఆత్మీయంగా మాట్లాడుతూ ఇంట్లో వారు ఎలా చూసుకుంటున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పెన్షన్ ప్రతి నెల సరైన సమయానికి అందిస్తున్నారా, అని కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధన పై అవగాహనలు ఉండాలి




**ఆదోని మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**నేటి కాలంలో కార్మికుల హక్కులు కాపాడుకొని వాటి సాధనకు చట్టాలపై అవగాహనలు కలిగి ఉండాలని న్యాయవాదులు చంద్రశేఖర్, బాలకృష్ణ, లోకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోనిలో స్థానిక రెవెన్యూ భవన్లో "మే"డే సందర్భంగా ప్రజలకు, కార్మికులకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక చట్టాల్లో ఎన్నో మార్పులు వచ్చాయని, ఆ చట్టాల సాధన కోసం ప్రతి ఒక్కరు అవగాహనాలు కలిగి ఉండాలని న్యాయవాదులు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఈరన్న, గోపాల్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్‌ల పంపిణీలో పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి



**ఆలూరు మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** హాలహర్వి మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాలహర్విలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్, మాజీ కన్వీనర్లు, క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జ్లు, బూత్ ఇంచార్జ్లు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు వైకుంఠం అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పత్తికొండలో అభివృద్ధి సంక్షేమానికి కొత్త ఊపు

● పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్యామ్ కుమార్

● గ్రామాల్లో సీసీ రోడ్లు,పింఛన్ల పంపిణీ కార్యక్రమం.





**పత్తికొండ మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతమవుతున్న నేపథ్యంలో పత్తికొండ నియోజకవర్గంలో కూడా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ గురువారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్రిష్ణగిరి మండలం పుట్లూరు గ్రామంలో మారెమ్మ అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రార్థించారు. అనంతరం సామాజిక పింఛన్లు పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేశారు. ప్రజా వేదికలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా పుట్లూరు గ్రామంలో ₹10 లక్షలతో సీసీ రోడ్డు, కర్లకుంటలో ₹15 లక్షలు, అమ్ముకుతాడు గ్రామంలో ₹20 లక్షలు, గోకులపాడు గ్రామంలో ₹50 లక్షలతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. క్రిష్ణగిరి మోడల్ స్కూల్ టాపర్ బోయ మౌనిక (579 మార్కులు)ను సన్మానించి విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే పత్తికొండ, కోయిలకొండ ప్రాంతాల్లో జరిగిన పలు వివాహ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "ప్రజల సంక్షేమమే ధ్యేయం, అభివృద్ధే లక్ష్యం" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, పత్తికొండలో కూడా అదే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

# ఘనంగా మేడే వేడుకలు



**కర్నూలు మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):-**రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులైన జి. కబర్ధి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే ఉత్సవాలను కోల్స్ కాలేజ్ ఎదురుగల సర్కిల్ నందు ఘనంగా నిర్వహించారు. జడ్జి మాట్లడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం నల్సా (అసంఘటిత రంగంలో కార్మికులకు న్యాయ సేవలు) పథకం, 2015 మరియు రాజ్యాంగం కల్పించిన చట్టాలను గురించి అవగాహన కల్పించి, వీటివల్ల మీ సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. కార్మిక చట్టాలను గురించి అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులందరూ ఈ-శ్రమ్ కార్డులు పొందవలసిందిగా కోరారు. ఈ కార్డు ఉంటే ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు వివిధ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్డు పొందిన ప్రతి కార్మికుడికి ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రెండు లక్షల ప్రమాద మరణ/ అంగవైకల్య బీమా ఉచితంగా కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్మికులకు ఎవరికైనా చట్టపరమైన సమస్యలు ఉంటే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేస్తే వారికి ఉచితంగా సహాయాన్ని అందించి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.యన్.టి.యూ.సి జిల్లా ప్రసిడెంట్ బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఆనందం, కర్నూలు నియోజకవర్గం ఇన్చార్జి రాజేంద్రప్రసాద్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ సునీల్,సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్,దుకాణ కార్మికులు, ఆటో, హమాలీ, బిల్డింగ్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌కు ఘన వీడ్కోలు.. సేవలు ప్రశంసనీయం







**ములుగు ప్రతినిధి,మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కలెక్టర్‌గా రెండున్నర సంవత్సరాల పాటు సేవలందించిన దివాకర్ టి.ఎస్. సేవలు చిరస్మరణీయమని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి అధ్యక్షతన ఘన వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన పదవీకాలంలో మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు, అధికారులు అందించిన సహకారాన్ని కృతజ్ఞతతో స్మరించారు. ముఖ్యంగా మేడారం మహా జాతరను విజయవంతంగా నిర్వహించడంలో తీసుకున్న చర్యలు, గద్దెల పునరుద్ధరణ, భక్తులకు కల్పించిన సౌకర్యాలను గుర్తుచేశారు. ప్రతి సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ములుగు జిల్లాలో పనిచేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని, జిల్లాలోని అధికార బృందం అద్భుతంగా పనిచేసిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పి.ఓ లెనిన్ వత్సల్ టొప్పో, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు మాట్లాడుతూ కలెక్టర్ దివాకర్ టి.ఎస్. పారదర్శక పరిపాలన, ప్రజాసంక్షేమంపై చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని కొనియాడారు. జిల్లా అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తుకు మార్గదర్శకమని అన్నారు. పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి బ్లాక్‌బెర్రీ, దేవుని గుట్ట, లక్నవరం ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. రామప్ప దేవాలయంలో ప్రపంచ సుందరీమణుల పర్యటనను విజయవంతంగా నిర్వహిం చడం ద్వారా జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతిని ధులు, అధికారులు కలిసి పనిచేయడం వల్లే జిల్లా మంచి పేరు సాధించిందని కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరి సహకారం తనకు లభించిందని, పాత్రికే యులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌ను అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# కార్మికులకు "మేడే" శుభాకాంక్షలు

● మున్సిపల్ కార్మికులకు సన్మానం చేసి స్వీట్లు పంపిణీ



**రాయచోటి మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):**రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా 50 మంది మున్సిపల్ కార్మికులను ఆహ్వానించి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, స్వీట్లు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక శక్తి దేశ అభివృద్ధికి మూలస్థంభమని, రక్తాన్ని స్వేదంగా మార్చి సమాజాన్ని ముందుకు నడిపే కార్మికులకు వందనం తెలిపారు. మండుటెండ, చలి, వాన లెక్కచేయకుండా శ్రమించే కార్మికుల త్యాగాలను గుర్తు చేసుకునే రోజే మేడే అని పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు ప్రతి రంగంలో కార్మికులే ప్రధాన శక్తిగా నిలుస్తారని, దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేది శ్రామిక వర్గమే అని తెలిపారు. టీడీపీ జెండాలో నాగలి, చక్రం, గుడిసె చిహ్నాలు కార్మికుల ప్రాధాన్యతను సూచిస్తాయని గుర్తుచేశారు. కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. కార్మికుల కోసం గుంటూరు, శ్రీసిటిల్లో 100 పడకల ఆసుపత్రులు, కర్నూలులో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోందన్నారు. కార్మికుల కృషిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సమానత్వం, గౌరవం, హక్కులు ప్రతి కార్మికుడికి అందాలని పేర్కొన్నారు. చివరగా కార్మికులందరికీ మరోసారి మేడే శుభాకాంక్షలు తెలిపారు.

# బస్సు ఎక్కే ముందు ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి?

- వచ్చే బస్సులకు ఎదురుగా వెళ్లి ప్రాణాల పైకి తెచ్చుకోకండి?.
- బస్సులు ప్లాట్ ఫారం వరకు రాకముందే ఎదురుగా వెళ్లి ఇబ్బందులకు గురి చేస్తున్నారు?.
- ఆర్టీసీ అధికారులు, పోలీసు శాఖ ప్రయాణికులకు అవగాహన కల్పించిన వారి మాటలను లెక్కచేయడం లేదు?.
- జనగాం డిపో బస్టాండ్‌లో శుక్రవారం జరిగిన ప్రమాదం?.






**తొర్రూరు ప్రతినిధి, మే 01 (పిసిడబ్ల్యూ న్యూస్):** గతంలో ఆర్టీసీ బస్సులు బస్టాండ్ ఆవరణలో వచ్చి ప్లాట్ ఫారంవరకు వచ్చేవరకు వేచి ఉండి బస్సు ఎక్కేవారు. ప్రస్తుత పరిస్థితులలో మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేసినా అనంతరం ఎంతోమంది మహిళలు వారు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కొందరు ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు?. ప్రయాణికులు కొందరు బస్సులను ప్లాట్ ఫారం వద్దకు తీసుకు రాకుండా దిగే స్థలాన్ని ఏర్పాటు చేసి అక్కడే ప్రయాణికులను దించి బస్సును ప్లాట్ ఫారం పైకి తీసుకురావటం సరైన పద్ధతిని మహిళలు కొందరు వారి మనసులోని మాటను వెల్లడిస్తున్నారు ఆర్టీసీ అధికారులు ఎంతమంది ఎన్ని రకాలుగా ప్రయాణికుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తున్నప్పటికీ కూడా వినే కాకుండా పోలీస్ శాఖ కూడా ప్రయాణికుల పట్ల ప్రమాదాలపైఅవగాహన సదస్సులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలిపినప్పటికీ కూడా వారిలో ఎలాంటి మార్పు రావడంలేదని బస్సులు వస్తున్న సమయంలోనే ఎదురుగా వెళ్లడం డ్రైవర్లకు ఎంతో ఇబ్బంది కలిగిస్తుందని అలాంటప్పుడు డ్రైవర్ ఏమి చేయలేని నిస్సహాయులుగా ఉండిపోవాల్సి వస్తుందని అన్నారు. శుక్రవారం జనగాం డిపో బస్టాండ్ లో జరిగిన ఒక దుర్ఘటన మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. తొర్రూరు బస్సుకు రావాల్సిన ఒక మహిళ 4 నెంబర్ ఫ్లాట్ ఫారంవరకు వచ్చి బస్సు ఎక్కాల్సిన మహిళ బస్సు అందకపోవటంతో ఎదురుగా పరిగెత్తుకుంటూ వచ్చి బస్సు డోర్ లో కదులుతున్న బస్సు ఎక్కేందుకు ప్రయత్నించి డోర్లో చేయి జారడంతో కింద పడిపోగా బస్సు వెనక చక్రం కింద మహిళ కాలు పైనుండి బస్సు వెళ్లినట్లు విశ్వసనీయ సమా చారం. బస్సు ఎక్కేందుకు ముందుగా ప్రయాణికులు కదులుతున్న బస్సులలో పరిగెత్తుకుంటూ బస్సులు ఎక్కి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కూడా లేకపోలేదు?. ఇప్పటికైనా ప్రయాణికులు బస్సులకు ఎదురుగా వెళ్లి ప్రాణాల పైకి తెచ్చుకోవద్దని ఆర్టీసీ అధికారులు పదేపదే విన్నవిస్తున్నారు.





# తల్లిదండ్రులు కాబోతున్న నారా రోహిత్, సిరి

టాలీవుడ్ హీరో నారా రోహిత్, ఆయన భార్య, హీరోయిన్ సిరి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నారనే వార్త నారా అభిమానుల్లో, సినీ వర్గాల్లో ఎంతో సంతోషాన్ని నింపుతోంది. సినిమాల ఎంపికలో ఎంతో వైవిధ్యం చూపే రోహిత్, ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో అత్యంత మధురమైన ఘట్టంలోకి అడుగుపెడుతుండటం విశేషం.నారా రోహిత్, సిరి 'ప్రతినిధి-2' చిత్రంలో కలిసి నటించారు. ఆ సినిమా సమయంలో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారి, పెద్దల అంగీకారంతో గత ఏడాది అక్టోబర్‌లో వారు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వివాహం జరిగిన ఏడాది లోపే ఈ జంట తల్లిదండ్రులుగా ప్రమోషన్ పొందబోతుండటం విశేషం. సిరి సీమంతం వేడుకకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో, ఈ శుభవార్తపై అధికారికంగా స్పష్టత వచ్చినట్లయింది.నారా రోహిత్ ఒకవైపు వ్యక్తిగత జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, మరోవైపు తన కెరీర్‌లో కూడా బిజీగా ఉన్నారు. గతేడాది 'భైరవం' చిత్రంతో మాస్ ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో రోహిత్ ఒక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని భావిస్తున్నారు. మరోవైపు, తల్లిదండ్రులు కాబోతున్న నారా రోహిత్ దంపతులకు అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# 'జెట్లీ' ప్రదర్శనను అడ్డుకోవడం అన్యాయం

## : మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్

ప్రముఖ చిత్ర నిర్మాణ, పంపిణీ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ, తమ తాజా చిత్రం 'జెట్లీ' విడుదల విషయంలో ఎగ్జిబిటర్ల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణలోని కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్ల వివాదాన్ని అడ్డం పెట్టుకుని, మల్టీప్లెక్స్‌లలో తమ సినిమాను ప్రదర్శించకుండా నిలిపివేస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం ఒక బహిరంగ లేఖను విడుదల చేసింది. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ పార్ట్‌నర్ కెతిరెడ్డి శశిధర్ పేరిట విడుదలైన ఈ లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. "తెలంగాణలోని కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లలో వీక్లీ రెంటల్, రెవెన్యూ షేరింగ్ నిబంధనల విషయంలో కొంతకాలంగా వివాదం నడుస్తున్న విషయం వాస్తవమే. ఈ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు మా చిత్రాలను ఆ థియేటర్లలో ప్రదర్శించకూడదన్న మీ నిర్ణయాన్ని గౌరవించాం. మా గత చిత్రాల విషయంలోనూ ఇదే విధానం పాటించాం. అయితే, మా కొత్త చిత్రం 'జెట్లీ' విషయంలో మీరు వ్యవహరించిన తీరు ఆమోదయోగ్యంగా లేదు" అని లేఖలో పేర్కొన్నారు."సింగిల్ స్క్రీన్ల వివాదానికి, మల్టీప్లెక్స్‌ల ప్రదర్శనకు ఎలాంటి సంబంధం లేదు. మల్టీప్లెక్స్‌ల నిబంధనలపై మన మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవు. అలాంటప్పుడు, సంబంధం లేని ఒక అంశాన్ని కారణంగా చూపి మల్టీప్లెక్స్‌లలో మా సినిమాను అడ్డుకోవడం అన్యాయం. ఇది కేవలం ఒక విభేదంగా కాకుండా, ఉద్దేశపూర్వకంగా మాపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా కనిపిస్తోంది. ఒక విభాగంలోని నిబంధనలకు అంగీకరింపజేయడానికి, మరో విభాగంలో వ్యాపారాన్ని అడ్డుకోవడం చర్చలనిపించుకోదు. ఇది స్పష్టంగా ఒత్తిడి తంత్రంలా ఉంది" అని శశిధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకమైన చర్యలు తమను తీవ్రంగా నష్టపరుస్తాయని, వ్యాపార సంబంధాల్లో తప్పుడు సంప్రదాయానికి దారితీస్తాయని మైత్రీ అభిప్రాయపడింది. "సింగిల్ స్క్రీన్ల సమస్యపై మొదటి రోజు నుంచి న్యాయబద్ధంగా చర్చించడానికి మేము సిద్ధంగానే ఉన్నాం. అయితే, ఆ చర్చలకు ఇతర వ్యాపార ఒప్పందాలను ప్రభావితం చేయనివ్వకూడదు. దయచేసి ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, తక్షణమే మల్టీప్లెక్స్‌లలో 'జెట్లీ' సినిమా ప్రదర్శనకు అనుమతించాలని కోరుతున్నాం" అని లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం తీవ్రతను అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందించాలని ఎగ్జిబిటర్లను కోరారు.




# సెల్ఫీ ఫోజులతో ఆకట్టుకుంటున్న బుట్ట బొమ్మ!

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో బుట్ట బొమ్మగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న పూజా హెగ్డే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో అందరి దృష్టిని ఆకట్టుకొని ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ గత కొంతకాలంగా సరైన అవకాశాలు లేక వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేక ఒక్క హిట్ కోసం ఎదురుచూస్తోంది. ప్రస్తుతం హిందీలో, తమిళ్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె ఇటు ఇంస్టాగ్రామ్ వేదికగా కూడా అందాలు ఆరబోస్తూ మరింత ఫాలోయింగ్ పెంచుకునే పనిలో పడింది. అందులో భాగంగానే తాజాగా బ్లూ అవుట్ ఫిట్ లో సెల్ఫీ ఫోజులతో షేర్ చేసిన కొన్ని ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మిడ్ నైట్ బ్లూ ఎంబ్రాయిడరీ లెహంగా ధరించిన ఈమె.. స్ట్రా ప్లేస్ బ్లౌజ్ ధరించి, డైమండ్ చౌకర్ తో.. సహజ సిద్ధమైన స్ట్రెయిట్ హెయిర్ తో తన అద్భుతమైన మేకోవర్ ను పూర్తి చేసింది. వ్యానిటీ మిర్రర్లో సెల్ఫీ ఫోజులతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి .ఇదిలా ఉండగా ఈమె హిందీలో హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాలో నటిస్తోంది. జూన్ నెలలో ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ఇటీవల ఈ సినిమా నుండి విడుదలైన వావ్ పాట ఇప్పటికే లక్షలాది వీక్షణలను దాటి అన్నిచోట్ల ట్రెండింగ్ లో నిలిచింది. బాలీవుడ్ లోనే కాకుండా ఇటు సౌత్ లో కూడా ఈ పాటకు విపరీతమైన రెస్పాన్స్ లభిస్తోంది. ఇందులో ఈమెతో పాటు మృణాల్ ఠాకూర్ కూడా హీరోయిన్గా నటిస్తోంది. ఒకవైపు సినిమాలలో నటిస్తూనే మరొకవైపు దిగ్గజ దివంగత నటుడు వినోద్ మెహ్రా కుమారుడైన నటుడు రోహన్ మెహ్రాతో డేటింగ్ చేస్తోందని పుకార్లు సోషల్ మీడియాను కుదిపేస్తున్నాయి. గత కొంతకాలంగా వీరిద్దరూ డేటింగ్ చేస్తున్నారని అయితే ఈ విషయాన్ని మాత్రం బహిరంగంగా ప్రకటించడం లేదని చెప్పవచ్చు. ఇకపోతే వీరు తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా ఇద్దరు ముంబైలోనే కలిసి ఉండటం.. పైగా కలిసి వెకేషన్ లకు, పార్టీలకు వెళ్లడం చూసి నెటిజన్స్ వీరిద్దరు నిజంగానే డేటింగ్ లో ఉన్నారనే కామెంట్లు చేస్తున్నారు.



# పాపం చిట్టి.. ఆ పేరే శాపం అయ్యింది!

ద

'జాతిరత్నాలు' సినిమాతో చిట్టిగా తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ముద్దుగుమ్మ ఫరియా అబ్దుల్లా. ఈ హైదరాబాదీ అమ్మాయి చూడ్డానికి నార్త్ ముద్దుగుమ్మ అన్నట్లుగా ఉంటుంది. సుదీర్ఘ కాలం పాటు ఇండస్ట్రీలో స్ట్రగుల్ అయిన తర్వాత ఫరియా కు జాతిరత్నాలు వంటి మంచి విజయం దక్కింది. ఆ సినిమాతో నవీన్ పొలిశెట్టితో పాటు అందరికీ మంచి పేరు వచ్చింది. దర్శకుడు అనుదీప్ ఏ స్థాయిలో పాపులర్ అయ్యాడో తెలిసిందే. ఆ తర్వాత ఆయన పెద్దగా హిట్‌లు తీయక పోవడంతో ఆయన క్రేజ్ తగ్గుతూ వచ్చింది. ఇక చిట్టి పాత్రతో పాపులర్ అయిన ఫరియా అబ్దుల్లా ఇండస్ట్రీలో ఓ రేంజ్‌లో దూసుకు పోవాలని ఆశించింది. కానీ తెలుగు అమ్మాయి కావడంతో టాలీవుడ్ క్రేజీ హీరోలు ఈమెను దూరం పెడుతున్నారనే వార్తలు వస్తున్నాయి. పైగా ఈ అమ్మడి హైట్ సైతం సమస్యగా మారిందని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.ఫరియా గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఇన్‌స్టాగ్రామ్‌లో కాస్త అందాల ఆరబోత చేసినా కూడా తీవ్రమైన విమర్శలు ఎదుర్కొంటుంది. చిట్టి ఇలా ఉందేంటి అంటూ చాలా మంది బాహాటంగానే, ఏకంగా ఆమె టైమ్ లైన్‌కి వెళ్లి మరీ బ్యాడ్ కామెంట్స్ చేస్తున్నారు. ఇతర హీరోయిన్స్ మాదిరి మీరు కాదు అనుకున్నాం. కానీ మేము తప్పు అని నిరూపించారు. మాకు ఈ చిట్టి వద్దు, మీరు చిట్టి మాదిరిగా ఉంటేనే అభిమానిస్తాం అంటూ చాలా మంది ఆమెకు కామెంట్ చేస్తున్నారట. ఈ విషయాన్ని స్వయంగా ఫరియా అబ్దుల్లా చెప్పుకొచ్చింది. ఆమె నటించిన గాయపడ్డ సింహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియాతో మాట్లాడుతూ తన కెరీర్ పట్ల పూర్తి సంతృప్తితో లేనట్లుగా చెప్పింది. తనకు దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదని కూడా ఆమె బాధ పడుతుంది. అందుకు కారణం తన మొదటి సినిమాలోని పాత్ర అని కూడా ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో చిట్టి ని అభిమానించే వారు చాలా మంది ఉన్నారు. కానీ ఫరియాను హాట్ లుక్ లో చూసేందుకు మాత్రం ఇష్టపడటం లేదు. ప్రేక్షకులు మాత్రమే కాకుండా ఫిల్మ్ మేకర్స్ సైతం ఆమెను గ్లామర్ రోల్స్ లో చూపించేందుకు ఆసక్తి చూపడం లేదు. పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆమె కూడా అందాల ఆరబోత చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇండస్ట్రీలో తనను తాను నిరూపించుకునేందుకు గాను అన్ని పాత్రల్లో నటించాలని కోరుకుంటున్నట్లు ఆ ఇంటర్వ్యూలో చెప్పింది. అంతే కాకుండా గ్లామర్ పాత్రలు చేయడం ద్వారా కూడా తనను తాను నిరూపించుకోవాలని చూస్తున్నట్లు పేర్కొంది.





# 'పెద్ది' సినిమా అప్డేట్..

## షూటింగ్ పూర్తయినట్లు తెలిపిన రత్నవేలు

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' సినిమా షూటింగ్ పూర్తయింది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఈ చిత్రం చిత్రీకరణ ముగిసినట్లు సినిమాటోగ్రాఫర్ రత్నవేలు ప్రకటించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో రామ్ చరణ్ తో తనకున్న అనుబంధాన్ని పంచుకుంటూ ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. "పెద్ది సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా కోసం మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి చేసిన ఈ ప్రయాణం ఎప్పటికీ మరువలేనిది. ఆయనతో కలిసి పనిచేయడం నిజంగా ఒక ప్రత్యేక అనుభవం" అని రత్నవేలు తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.రామ్ చరణ్ నటనను, వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ.. "తెరపై అద్భుతమైన నటనతో అదరగొట్టే ఆయన, తెర వెనుక ఒక గొప్ప స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించుకున్న ఈ జ్ఞాపకాలకు ఎంతో కృతజ్ఞుడిని" అని రాసుకొచ్చారు.

రత్నవేలు పోస్ట్ తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ప్రస్తుతం టాలీవుడ్లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'పెద్ది' ఒకటి కాగా, తాజా అప్డేట్ తో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. చిత్రీకరణ పూర్తికావడంతో త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగవంతం కానున్నాయి.

# క్రమశిక్షణ లేదు.. ఒళ్లు బలిసి సినిమాలు తీస్తున్నారు: రవిబాబు

టాలీవుడ్ నటుడు, దర్శకుడు రవిబాబు తన తాజా చిత్రం 'రేజర్' విడుదల సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పరిశ్రమలో పెను సంచలనంగా మారాయి. మే 8న తన తండ్రి చలపతిరావు జయంతి సందర్భంగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న తరుణంలో, ఆయన చేసిన విమర్శలు చర్చనీయాంశమయ్యాయి.

ప్రస్తుత సినిమా నిర్మాణ విధానంపై రవిబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇండస్ట్రీలో క్రమశిక్షణ కరవైందని ఆయన ఆరోపించారు. గతంలో ఫిల్మ్ (రీల్) మీద షూటింగ్ చేసేటప్పుడు ప్రతి అడుగు ఎంతో ఖరీదైనదని, అందుకే నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎంతో అంకితభావంతో పనిచేసేవారని రవిబాబు గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అంతా డిజిటల్ కావడంతో బాధ్యతారాహిత్యం పెరిగిందని ఆయన మండిపడ్డారు.

"ఇప్పుడు చిప్ తీయడం, డేటా తుడిచేయడం సులభమైపోయింది. దీనివల్ల సమయానికి, డబ్బుకి విలువ లేకుండా పోయింది. సరైన ప్రొడక్షన్ ప్లానింగ్ ఉండటం లేదు. నిజం చెప్పాలంటే, ఇప్పుడు సినిమాలు తీసేవాళ్ళు ఒళ్ళు బలిసి తీస్తున్నారు" అని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి.

రవిబాబు వాడిన 'ఒళ్ళు బలిసి' అనే పదంపై సోషల్ మీడియాలో యుద్ధం మొదలైంది. నేటి తరం స్టార్ హీరోలను, టెక్నీషియన్లను ఉద్దేశించి ఇలాంటి పదజాలం వాడటం సరికాదని పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'రేజర్' సినిమాను బహిష్కరించాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు, రవిబాబు వ్యాఖ్యల్లో వాస్తవం ఉందని కొందరు సమర్థిస్తున్నారు. విచ్చలవిడిగా బడ్జెట్ పెంచేస్తూ, క్రమశిక్షణ లేకుండా షూటింగ్‌లు చేయడం వల్ల నిర్మాతలు రోడ్డున పడుతున్నారని, ఆయన అన్నది పచ్చి నిజమని వారు వాదిస్తున్నారు.

